ఆదివారం 23 నవంబర్ 2025

7న నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

డిసెంబర్ 7న జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలోని తిరుమల సాయి హై స్కూల్ వద్ద జవహర్ నవోదయ మెగా మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ సరళ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్లుగా జవహర్ నవోదయ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తిరుమల సాయి హైస్కూల్ తొలిసారిగా మెగా మోడల్ టెస్ట్-2026ను నిర్వహిస్తుందని తెలిపారు. నవోదయ పరీక్షకు ఆసక్తి చూపే విద్యార్థులు డిసెంబర్ ఐదో తేదిలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం గూగుల్ ఫారం లింకు లేదా నేరుగా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని చెప్పారు.

ఆక్రమణకు గురైన వరహాలగెడ్డ స్థలం ఇదే

హద్దుల సుద్దులు

- వరహాల గెడ్డ రిజిస్ట్రేషన్ రద్దు చేయకుండా కాలక్షేపం
- హద్దులు నిర్ణయించి, బోర్డు పెట్టి వదిలేసిన అధికారులు
- ప్రభుత్వ ఆస్తులు కాపాడుతున్నట్లు ఉత్తుత్తి ప్రకటనలు
- సేల్ డీడ్ రద్దయినప్పుడే రక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న వరహాల గెడ్డ ప్రభుత్వ భూమి విషయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చాలా తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాల్సిన అధికారులే కంచే చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములు పెత్తందారులకు ధారాదత్తం చేస్తున్నారు. వరహాల గెడ్డ ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 410లో ఉంది. ఏడు సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం మార్కెట్ రేట్ ప్రకారం సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుంది. ఇలాంటి భూమి పక్కనే పట్టణానికి చెందిన వ్యాపారి కొత్తకోట ప్రసాద్‌కి స్థలం ఉంది. ఈ స్థలం వంకర టింకరగా ఉండడంతో పక్కనే ఉన్న వరహాల గెడ్డ భూమిపై ఆయన కన్ను పడింది. ప్రభుత్వ భూమితో వ్యాపారి కొత్తకోట ప్రసాద్ జిరాయితీ భూమి కలపకపోతే ఆయన స్థలానికి విలువ లేదు. వరహాల గెడ్డ భూమి లేకపోతే వ్యాపారి స్థలాన్ని కొనుగోలు చేసే నాథుడు లేడు. ఇలాంటి పరిస్థితుల్లో తన జిరాయితీ భూమికి విలువ పెంచుకోవడానికి ప్రభుత్వ భూమి కబ్జాకి స్కెచ్ వేశారు. దీనికి అధికారపార్టీకి చెందిన ముఖ్య నాయకుడి అండదండలు కావాలని భావించి డీల్ కుదుర్చుకున్నారు. ఆ డీల్ అనుకున్న విధంగా కుదిరి పోవడంతో ఏకంగా విశాఖపట్నానికి చెందిన లక్కీ షాపింగ్ మాల్ యజమానికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. తన జిరాయతీ సర్వే నెంబర్ 411-9తో ప్రభుత్వ భూమిని కలిపి రిజిస్ట్రేషన్ చేయించారు. మొత్తం 1200 గజాల స్థలాన్ని లక్కీ షాపింగ్ మాల్ యజమానికి రిజిస్ట్రేషన్ చేశారు. గత నెల 12న ఈ రిజిస్ట్రేషన్ జరిగిపోవడంతో భూ బాగోతం వెలుగులోకి వచ్చింది.

అధికారపార్టీ ముఖ్య నాయకుడి అండతో ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేయడంపై 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. దీంతో స్పందించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వరహాల గెడ్డ భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో అది ప్రభుత్వ భూమి అని, ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు పెట్టి చేతులు దులుపేసుకున్నారు. ఇక్కడితో తమ పని అయిపోయిందని భావించిన అధికారులు జరిగిన రిజిస్ట్రేషన్ గురించి మాత్రం నోరు మెదపడం లేదు. వరహాల గెడ్డ భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టి హెచ్చరిక బోర్డు పెట్టినంత మాత్రాన దానికి రక్షణ ఉండదు. ప్రభుత్వ భూమిని తన జిరాయతీ భూమితో కలిపి చేసిన రిజిస్ట్రేషన్‌ని రద్దు చేసినప్పుడే అధికారులు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించినట్లు అవుతుంది. అంతేకానీ వరహాల గెడ్డ భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయడం వల్ల ఆ స్థలానికి రక్షణ ఉండదనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా రెవెన్యూ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వరహాల గెడ్డ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్

పార్వతీపురం : పట్టణంలోని వరహాల గెడ్డ అక్రమ రిజిస్ట్రేషన్ తక్షణమే రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సామాజిక భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన సామాజిక చైతన్య వేదిక నాయకులు పి.రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వరహాల గెడ్డ భూమి ఆక్రమణపై ఇప్పటికే అనేక దఫాలుగా జిల్లా అధికారులకు తెలియజేశామని అన్నారు. సర్వే నెంబర్ 410లో ఆక్రమణకు గురై, తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించిన కొంత భాగంలో వేసిన కంచెను తాత్కాలికంగా మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. వరహాల గెడ్డ సర్వే నెంబర్ 410కి సంబంధించిన గెడ్డ పోరంబోకు ప్రాంతాన్ని పూర్తిగా సర్వే జరపాలని, గెడ్డ ఎంత విస్తీర్ణంలో ఉండేదో హద్దులు నిర్ణయించాలని కోరారు. ఆక్రమిత గెడ్డ స్థలంలో నిర్మించిన శాశ్వత కట్టడాలను సైతం తొలగించాలని డిమాండ్ చేశారు. తూతూ మంత్రంగా కంచె తొలగించడం వల్ల ప్రయోజనం లేదని చెప్పారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడతారని గత చరిత్ర చెబుతోందని తెలిపారు. ఇప్పటికైనా సమగ్ర సర్వే నిర్వహించి, వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగించాలని, ఆ భూమి ప్రజావసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యాన పోరాటం నిర్వహించి ఆక్రమణలను తామే తొలగిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. స్పందించకుంటే కలెక్టర్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.వి రమణ, జి.వి.రమణ (సిపిఎం), ఆర్‌విఎస్ కుమార్ (ఎఐటియుసి), పి.ఈశ్వరరావు, పి.రమణి (అఖిల భారత రైతు కూలీ సంఘం), పి.భాస్కరరావు (సిపిఐ లిబరేషన్ పార్టీ), ఎం.భాషా (రైతు కూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్), టి.జీవా, జి.సూరయ్య (రెడ్ స్టార్ పార్టీ), బి.నర్సింగరావు (గ్రామీణ పేదల సంఘం), సిహెచ్ చంద్రరావు (చెరువుల సంరక్షణ సమితి), న్యాయవాది పి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

లేబర్‌కోడ్ల ప్రతులను దహనం చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

శ్రమ దోపిడీకే లేబర్ కోడ్లు

ప్రతులను దహనం చేసిన కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకే దోచిపెట్టడానికే లేబర్ కోడ్లు తీసుకొచ్చారని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ పార్వతీపురం మెయిన్ రోడ్డులో లేబర్ కోడ్ల ప్రతులను దహనం చేశారు. జిల్లా కలెక్టరేట్ దగ్గర సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు కూలీ సంఘం, గ్రామీణ పేదల సంఘం, టియుసిఐ, సిపిఐఎంఎల్ లిబరేషన్, గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు లేబర్ కోడ్లు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కుమార్, గొర్లి వెంకటరమణ, బి.వెంకటరమణ, ఎం.భాష, ఇ.భాస్కరరావు, నర్సింగరావు, ఇ.జీవన్, సూరయ్య, పి.రంజిత్ కుమార్, బొంకుర సూరిబాబు, కోరాడ ఈశ్వరరావు, బి.లక్ష్మి, యు లక్ష్మి, పి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సాలూరులో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శంకరరావు, రాముడు మాట్లాడుతూ సుదీర్ఘకాలం కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఢిల్లీ కేంద్రంగానే పోరాటం జరిగిందని గుర్తు చేశారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి ఇప్పుడు కార్పొరేట్ల కోసం కార్మిక వర్గానికి గుదిబండలాంటి విధానాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవి, మధు, మోహన్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : లేబర్ కోడ్ల ఉత్తర్వులను సిఐటియు ఆధ్వర్యంలో భామిని కూడలిలో శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలు ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలకు వలసపాలన వాసనలు ఉన్నాయని, వాటిని ఆధునీకరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా పచ్చి అబద్ధమన్నారు. వలస పాలనకు మించి బానిసత్వాన్ని కార్మిక వర్గం మీద రుద్దేందుకు లేబర్ కోడ్లలో మార్పులను జొప్పించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎం.అప్పలస్వామి, జి.జగన్నాయకులు, బి.పద్మమ్మ, ప్రజాసంఘాల నాయకులు కె.మీ న్నారావు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు, భామినిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పుస్తక మహోత్సవాన్ని వినియోగించుకోవాలి

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్



పార్వతీపురం మన్యం పుస్తక మహోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జెసి, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 25 నుంచి పార్వతీపురంలో నిర్వహించే పార్వతీపురం మన్యం పుస్తక మహోత్సవాన్ని (పిఎంపిఎం) సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి జిల్లా వాసులకు పిలుపునిచ్చారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన పార్వతీపురంలో ఈ నెల 25 నుంచి డిసెంబర్ ఐదో తేది వరకు నిర్వహించే పుస్తక మహోత్సవం-2025 పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, డిఎంహెచ్‌ఒ కె.భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ జి.నాగ భూషణరావుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అలవర్చుకుని సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు కిరణ్, శ్రీనివాస్, పుస్తక మహోత్సవం వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో..

పార్వతీపురం మన్యం పుస్తక మహోత్సవంలో పుస్తకాలతో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ప్రదర్శనలతో పండగ వాతావరణం నెలకొంటుందని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కోఆర్డినేటర్ కిరణ్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తక మహోత్సవం లక్ష్యాలు, కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. మన ముందున్న తరం పుస్తక పఠనం నుంచి దూరమవుతోందని, స్మార్ట్ ఫోన్లకు బానిసవుతోందని చెప్పారు. భావోద్వేగ స్థిరత్వం, ఆలోచనా లోతు, సాంస్కృతిక అవగాహన పెరగాలంటే పుస్తకాలు చదవాలని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీసం ఒక పుస్తకం బహుమతిగా ఇవ్వాలనే భావనను ఈ మహోత్సవం ముందుకు తెస్తోందన్నారు.

ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సాహిత్య వైభవం, ప్రజాస్వరం, కళాత్మకత, పోరాట స్ఫూర్తి, జానపద మూలాల గురించి విస్తారంగా మాట్లాడారు. పురిపండ అప్పలస్వామి, వంగపండు ప్రసాదరావు, భూషణం, గణేష్ పాత్రో వంటి మహనీయులను గుర్తుచేస్తూ మహోత్సవ వేదికల పేర్లు కూడా ప్రాంతీయ సాహిత్య చరిత్రను ప్రతిబింబిస్తాయని తెలిపారు. సాహిత్యం కేవలం పేజీల్లో కాదని, జీవన విధానంలో ఉందని చెప్పారు.

కన్వీనర్ ఎస్.మురళీమోహన్ రావు మాట్లాడుతూ బుక్ ఫెస్టివల్‌లో ఉపాధ్యాయుల బృందం నాటక ప్రదర్శన, వెయ్యి మంది విద్యార్థులతో సామూహిక 'పాడుదుమా స్వేచ్ఛా గీతం' గాన ప్రదర్శన, కోలాటం, తప్పెట గుళ్లు, నృత్య ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణలని తెలిపారు. జెవివి ఆధ్వర్యాన మూఢ నమ్మకాలపై ప్రయోగాలు , డెమోలు, నెయిల్ బెడ్, గ్లాస్ పీసెస్ వాక్, సైన్స్ మ్యాజిక్ షోలు, టెలిస్కోప్ ద్వారా స్టార్ గేజింగ్ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. విబిఎఫ్‌ఎస్ సభ్యులు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ 100 రకాల పబ్లిషర్స్ పుస్తకాలు, లక్షకు పైగా పుస్తక శీర్షికలు పార్వతీపురం జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ ఐదో తేది వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో పుస్తక మహోత్సవం జరుగనుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పుస్తక మహోత్సవం, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఎఎన్ఎం పాత్ర కీలకం

ప్రజాశక్తి-సాలూరు

గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంలో ఎఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులే కీలకమని మంత్రి సంధ్యారాణి తెలిపారు. శనివారం సాలూరు ఏరియా ఆసుపత్రి ఆవరణలో శిక్షణ పొందిన స్టాఫ్‌నర్స్, ఎఎన్ఎంలకు సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యవృత్తిలో వైద్యుల తర్వాత నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి బాగోగులు చూసే మొదటి వరుసలో ఉండేది నర్సింగ్ సిబ్బంది మాత్రమేనని తెలిపారు. ఇది కేవలం వృత్తిగా కాకుండా రోగులకు మెరుగైన సేవలు అందించే ఒక పవిత్రమైన బాధ్యతగా భావించి పని చేయాలని కోరారు.

అనంతరం ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని మంత్రి పరిశీలించారు. ఇంకా పూర్తి చేయవలసిన పనులపై ఆసుపత్రి అధికారులతో వివరంగా చర్చించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మీనాక్షి, ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆసుపత్రి సలహా కమిటీ సభ్యులు, వైద్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజా వైద్యం.. ప్రజల హక్కు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రజా వైద్యం ప్రజల హక్కని, ఆ హక్కును టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయివేటు పరం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. శనివారం పట్టణంలోని సౌందర్య థియేటర్ రోడ్డు కూడలి వద్ద ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిపిపి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేసేందుకు కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. దీన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపడుతున్న సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

రూ.100 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు పట్టణానికి రూ.100 కోట్లతో మంచినీటి సరఫరా కోసం ప్రతిపాదన సిద్ధం చేసినట్లు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాలూరు పట్టణ అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయని తెలిపారు. పట్టణానికి సంబంధించి 100 కోట్ల విలువైన భారీ తాగునీటి ప్రాజెక్టుకు ఆమోదించినట్లు చెప్పారు. దీంతో పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అవుతుందని తెలిపారు. మున్సిపాలిటీలో కొన్ని పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతతో ముందుకు తీసుకెళ్లేలా కఠినంగా పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ పి.సుబ్బారావు, ఇఇ ఎన్.రాంబాబు, కె.మంజుల, డిఇ ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దగెడ్డ రిజర్వాయర్ పరిశీలన

పాచిపెంట : సాలూరు మున్సిపాలిటీకి తాగునీరు అందించేందుకు 7 ఎంఎల్‌డి ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం శనివారం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ ప్రభాకర్ రావు పెద్దగడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో 64 కోట్ల రూపాయలతో వాటర్ స్కీమ్ మంజూరైందని, మళ్లీ ఇప్పుడు రివైజ్ టెండర్ తెరిచామని తెలిపారు. సాలూరు మున్సిపాలిటీలో సుమారు 50 వేల జనాభాకు తాగునీటి కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టి రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్ట్‌లు ఉన్న ప్రతి చోటా వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ సిఇ సుధాకర్ రావు, ఎస్ఇ కామేశ్వరరావు, ఇఇ జ్యోతి, డిఇ వంశీకృష్ణ పాల్గొన్నారు.

పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

మంత్రి ద్వంద్వ వైఖరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దుగ్గేరులో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీంతో గిరిజనులు, రైతులు, వ్యవసాయ కార్మికుల మనుగడ కష్టనష్టాలకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే విషయమై పార్వతీపురం మన్యం జిల్లాలో చర్చ నడుస్తోంది. ఈ ప్రాజెక్టు ముందుకు సాగితే మంత్రి రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ పవర్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని వెంగళరాయసాగర్, తోటపల్లి ప్రాజెక్టుల నుంచి 24 మిలియన్ క్యూబిక్ లీటర్ల నీటిని తరలించడానికి అనుమతులు ఇచ్చారు. రూ.25 వేల కోట్లతో 2 వేల మెగావాట్లు తయారు చేసే పవర్ ప్లాంట్ దుగ్గేరు ప్రాంతంలో నిర్మిస్తే ఈ ప్రాంతంలో పనసభద్ర పంచాయతీలోని గ్రామాలన్నీ ఖాళీ చేయించే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి చర్యలకు ముందే పీసా చట్టం, షెడ్యూల్ చట్టం ప్రకారం గ్రామసభల ఆమోదం తీసుకోవాల్సి ఉంది. కానీ, కనీసం గిరిజనుల అభిప్రాయాలు కూడా తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చింది. దీనిపై మంత్రి సంధ్యారాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు. కనీసం చర్చకు పెట్టలేదు. మరోవైపు ప్రజాభిప్రాయం మేరకే ప్రభుత్వం ముందుకు వెళుందని స్థానికంగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఈ నేపథ్యంలో గిరిజనుల బతుకులు నాశనమవ్వడమే కాకుండా అటు వెంగళరాయి సాగర్, తోటపల్లి ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు రైతులు నష్టపోతారనే ఆందోళన జిల్లా వ్యాప్తంగా నెలకొంది. ఈ ప్రాజెక్టుల దిగువున ఉన్న భూములు ఎడారిగా మారే పరిస్థితి ఉంటుంది.

ఇప్పటికే ఈ రెండు ప్రాజెక్టుల కిందా చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందడం లేదు. ఈనేపథ్యంలో ఎక్కడ, ఎవరి అభిప్రాయాలు సేకరించి జిఒ 84 జారీచేశారని జనం ప్రశ్నిస్తున్నారు. మంత్రికి చిత్తశుద్ధి ఉంటే ప్లాంట్ అనుమతులు రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో గిరిజనులు, రైతులు కలిసికట్టుగా నిన్నే (ఈనెల 22న) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు కూడా నిర్వహించారు. దీనికి ముందు ఎర్ర సామంతవలస, పనసభద్ర, దుగ్గేరు, మెండంగి, బాగుజోల, ఆలగరువు, చిలకమెండంగి, బండ మెండంగి తదితర గ్రామాల్లో చేసిన ప్రచారానికి మంచి స్పందనే లభించింది.

సాగునీటికి ముప్పు

ఈ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు వల్ల మన్యంతోపాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాకు కూడా సాగునీటి ముప్పువాటిల్లనుంది. 64వేల ఎకరాల స్థిరీకరణతోపాటు 1,46,221 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో తోటపల్లి బ్యారేజీ ఆధునీకరణ, కుడి ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేసినట్టు పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ నేటికీ లక్ష్యంలో సగం ఆయకట్టుకు కూడా నీరు అందడం లేదు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లతోపాటు విజయనగరం జిల్లాలోని రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలకు చాలా తక్కువగా నీరు అందుతోంది. గజపతినగరం వాసులకు చుక్కనీరు కూడా వెళ్లడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు నీటిని పంప్డ్ స్టోరేజీకి మళ్లిస్తే సాగునీటి లక్ష్యం నీరుగారిపోయే ప్రమాదం కూడా కనిపిస్తోందని జనం నుంచి ఆందోళన వ్యక్తమౌతోంది.

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల కేంద్రంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలూ రాత్రీ తేడా లేకుండా, అటూ ఇటూ తిరుగుతున్న కుక్కలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కుక్కల సంఖ్య భారీగా పెరగడంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. శుక్రవారం రాత్రి సుమారు 19 మంది వరకు కుక్కల కాటుకు గురైనట్లు స్థానికులు తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితి కారణంగా తల్లిదండ్రులు చిన్నారులను పాఠశాలకు పంపించడానికి కూడా ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కురుపాంలో తిరుగుతున్న కుక్కలు

వినతి అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఉద్యోగ భద్రత కల్పించాలని కల్పించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆనందరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అన్ని కేటగిరీలకు హెచ్ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, హెల్త్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని కోరారు. గతంలో జరిగిన సమ్మెలో ఒప్పందాలకు పూర్తిగా అమలు చేయాలని, సమగ్ర శిక్షలోనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్చేశారు. సమస్యపై ఈ నెల 24న జిల్లా కేంద్రంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ప్రసాదరావు, వి.ఉమామహేశ్వరరావు, వి.హైమావతి, కృష్ణకుమార్, యు.స్వాతి, ఎం.నాగేశ్వరరావు, డి.పోలిరాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నీలకంఠరావు, సిబ్బంది

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కాకిలి జంక్షన్ వద్ద నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు శనివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు పరిశీలించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించామని చెప్పారు. భద్రత కోసం పోలీసులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ వెంకటప్పలనాయుడు

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కాశీపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సీతానగరం ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ తెంటు వెంకటప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని నేరుగా రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తేలు చంద్రశేఖర రావు, టిడిపి నాయకులు తేలు తిరుపతిరావు, టి.సత్యనారాయణ, టి.స్వామినాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

రావుపల్లి, రాయిందొరవలస, చినగుడబ పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్లకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గరుగుబిల్లి పిహెచ్సి వైద్యాధికారి ఎన్ఎంకె తిరుమలప్రసాద్ వెల్లడించారు. పక్కాభవనాలు నిర్మాణానికి సర్పంచ్లకు స్థలం కేటాయించాలని కోరామన్నారు. స్థలాలు కేటాయించిన అనంతరం విలేజ్ హెల్త్ క్లినిక్ల భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కురుపాం

గుమ్మిడిగూడ పంచాయతీ గుజ్జుపాడులో గత రెండున్నర ఏళ్లుగా వేధిస్తున్న విద్యుత్ పరిష్కారమైంది. విద్యుత్ స్తంభాల కొరత, శిథిలమైన సమస్యను గుమ్మిడిగూడకు చెందిన టిడిపి నాయకుడు మహేష్.. ఎమ్మెల్యే జగదీశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఎడిఇ, ఎఇకి ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్

గురుకులాల్లో ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-కొమరాడ

గురుకుల పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ కోరారు. శనివారం కొమరాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గురుకులంలో ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నారాయణస్వామి, ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సత్యసాయి సేవకుల అన్నదానం

ప్రజాశక్తి-సాలూరు

సత్య సాయి జయంతి సందర్భంగా సాలూరు మండలం మామిడిపల్లిలో సత్యసాయి సేవకులు సుమారు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో 150 మంది పేదలకు దుప్పట్లు, గొడుగులను అందజేశారు. గ్రామ నాయకులు బూస తవుడు, సువ్వాడ రామకృష్ణ, దువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సర్పంచ్ సువ్వాడ శశికళ, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, తాడుతూరి తిరుపతిరావు, సాదాపు త్రినాథరావు, జగ్గేన వెంకటరమణ, ఏనుగుల వెంకటరమణ, కరణం శంకరావు, శ్రీరాములు, రజిని.. సత్యసాయి సేవకులను అభినందించారు.

అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఇ-స్టాంపు విక్రయాల్లో చేతివాటం

ప్రజాశక్తి- మక్కువ

ప్రభుత్వం ఇ-స్టాంపు విక్రయాలను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఆ నిర్వాహకులు ఆడిందే ఆటగా మారింది. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఉండేవి. స్టాంప్ల విక్రయాల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు వీటి విక్రయ బాధ్యతలను అప్పగించింది. దీంతో ఏజెన్సీలు కొంతమంది వ్యక్తులకు ఐడిలు ఇచ్చి మండల కేంద్రాల్లో విక్రయించేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ విక్రయానికి గాను ఐదు శాతం కమీషన్ కూడా ఏజెంట్లకు ఇవ్వనుంది. గతంలో వెండర్లు మండలాల్లో స్టాంపులు విక్రయించి స్టాంపులపై ఉన్న ధర కంటే రూ.10 నుండి 20 వరకు అదనంగా వసూలు చేసేవారు. ప్రస్తుత ప్రయివేటు ఏజెన్సీలో అది కమీషన్ వ్యవహారం పరాకాష్టకు చేరింది. శుక్రవారం మక్కువ మండల కేంద్రంలో మధు కంప్యూటర్స్ సెంటర్లో చెముడు గ్రామానికి చెందిన కె.మహేశ్వరరావు పేరిట ఆయన బంధువు రూ.50 ఇ-స్టాంపు కొనుగోలు చేశారు. ఆ స్టాంపుపై అదనంగా మరో 50 రూపాయలు వసూలు చేసిన విషయం శనివారం వెలుగు చూసింది. మక్కువ గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వ్యక్తులు దుకాణ తనకాల విషయంలో తీసుకున్న రూ.100 ఇ-స్టాంప్ పేపర్లకు గాను 500 రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ తపాలా ఉద్యోగి తన బంధువుల పేరుతో నిర్వహిస్తున్న మీ సేవా కేంద్రంలోనే కాకుండా ఇతర కేంద్రాల్లో కూడా ఇదే తరహా దోపిడీ జరుగుతుందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అవసరాలకు ఇ-స్టాంపులు కొనుగోలు చేయాలంటే సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం పట్టణాలకు కొనుగోలుదారులు వెళ్లాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న నిర్వాహకులు విచ్చలవిడిగా దోపిడీకి తెగబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ఇ-స్టాంపులు అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మా పరిధిలోకి రావు

ఇ-స్టాంపు విక్రయాలు ప్రస్తుతం మా పరిధిలోకి రావు. వీటిని ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఏజెన్సీలు కొంతమంది ఏజెంట్లు నియమించుకొని నిర్వహణ చూసుకుంటున్నాయి.

- నాగరాజు, సబ్ రిజిస్ట్రార్, సాలూరు

విచారణ చేపడుతాం

తపాలా శాఖ ఉద్యోగిపై ఇ-స్టాంపు విక్రయాల్లో వస్తున్న ఆరోపణలపై విచారణ చేపడతాం. బిపిఎంలకు వారు విధులు నిర్వహించిన తర్వాత కొన్ని వెసులుబాట్లు ఉన్నాయి. ఇ-స్టాంపుపై ఉన్న ముద్ర ఆ ఉద్యోగిది కాదా? అవునా? అన్న విచారణ చేపడతాం.

- బాబూరావు, పోస్టల్ సూపరింటెండెంట్, పార్వతీపురం



INDIA NON JUDICIAL
Government of Andhra Pradesh
e-Stamp
IN-AP42257029950798X

Certificate No.	IN-AP42257029950798X
Certificate Issued Date	21-Nov-2025 01:39 PM
Account Reference	CSCACC (GV)/ apcsceg07/ AP-MNY/ AP-MNYVEN1229/apvenhem1229u
DDO Code	27002308001 O/o IG R
Unique Doc. Reference	SUBIN-APAPCSCEG0768255933296685X
Purchased by	KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Description of Document	Article 6(C) Agreement In any other case
Property Description	AGREEMENT
Consideration Price (Rs.)	0 (Zero)
First Party	KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Second Party	Not Applicable
Paid By (For Whom)	KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Stamp Duty Amount(Rs.)	50 (Fifty only)

Please write or type below this line

అధిక ధరకు విక్రయించిన ఇ-స్టాంపు ఇదే

గోతులు పూడ్చుతున్న సభ్యులు

గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని రహదారుల్లో ఏర్పడిన గోతులను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన సభ్యులు శనివారం పూడ్చే కార్యక్రమం చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని రహదారుల్లో గోతులు కప్పలేని పరిస్థితిలో మున్సిపల్ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు ఈ లోతుల్లో పడి అనేక సార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మానవ సేవే మాధవ సేవ అన్న సత్యసాయి బోధనలను ఆచరణలో స్థానిక సేవాసమితి సభ్యులు చేసి చూపించారు. పట్టణమంతా తిరిగి గోతులను పూడ్చివేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే విజయచంద్ర, జగదీశ్వరి

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్లో ఆయన ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ మేరకు రోడ్లు, కాలువలు, పింఛన్లు, గృహాలు, భూ సమస్యలపై వినతులు అందాయి. వీటిపై ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్

గుమ్మలక్ష్మీపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ ఒక వేదికగా నిలుస్తోందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజలు తాగునీరు, రోడ్లు, సిఎం సహాయ నిధి, తదితర వాటిపై వినతులు ఇచ్చారు. వినతులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

అర్హులందరికీ జాబ్కార్డులు

వీరఘట్టం.. గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

ప్రజాశక్తి - కురుపాం

అర్హులందరికీ జాబ్కార్డులు అందేలా ఉపాదిహామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. శనివారం మండలంలో రస్తాకుంటుబాయి, గొటివాడ గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో ఆమె మాట్లాడారు. సరైన సమయంలో వేతనాలు చెల్లింపు, కార్డులలో ఉన్న లోపాల సవరణ, కొత్త దరఖాస్తుల స్వీకరణ, వేతనదారుల ఫొటోలు అప్డేట్ వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఉపాధి హామీలో అర్హులైన వారికి జాబ్కార్డులు మంజూరు చేస్తామని ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి జాబ్ కార్డు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇఒ వై.గిరి, ఎపిఒ జి.సత్యంనాయుడు, గ్రామ నాయకులు జామి లక్ష్మీనారాయణ, సింహాచలం, జంపు చంద్రశేఖర్, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తూముల రమేష్, సుక్క శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

సీతానగరం.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి, ఎస్ఐ కె.మురళి శనివారం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల చెడు వ్యసనాలకు బానిసలు అయితే వారి జీవితాన్ని కోల్పోతారన్నారు. మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకూడదని చెప్పారు. ఎవరైనా మత్తుపదార్థాలు వినియోగిస్తే వెంటనే సమాచారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దాలినాయుడు, లెక్చరర్లు రామకృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కురుపాం : విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాల వైపు ఆకర్షితులు కాకుండా తమ భవిష్యత్తును సన్మార్గంలో తీర్చిదిద్దుకోవాలని కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే సామాజిక, శారీరక, మానసిక హానికారక ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో డ్రగ్స్, గుట్కా, గంజాయి, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని తెలిపారు. విద్యార్థి దశనుండే సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె. రాజశేఖర్, ఆదర్శ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోనా గొటివాడ పంచాయతీలో బోరే బండిగూడలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను శనివారం ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్తో ఆమె మాట్లాడి పెండింగ్లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణం ఆలస్యమవడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి



మాట్లాడుతున్న తహశీల్దార్ భరత్కుమార్

14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో 14 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తహశీల్దార్ భరత్ కుమార్ తెలిపారు. శనివారం చెముడు రైతు సేవా కేంద్రం వద్ద సిఎస్ డిటి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ భారతి, టిడిపి మండల అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు, సర్పంచ్ బొంగు రాజేశ్వరి, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలు నిలిపేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

జంఝావతి ఎడమ కాలువపై భారీ వాహనాల రాకపోకలను నిలిపేయాలని, శిథిలావస్థకు చేరుకున్న గట్టును కాపాడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి.. ఇరిగేషన్ అధికారులను కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ఎడమ కాలువ గట్టును ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంఝావతి రిజర్వాయర్ ఎడమ కాలువను అర్తం నుండి చంద్రంపేట, పరశు రాంపురం గ్రామాల పొలాలకు నీరందించేలా ఏర్పాటుచేశారని తెలిపారు. కాలువ గట్టు శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే దెబ్బతింటుందన్నారు. జంఝావతి ఇరిగేషన్ అధికారులు గట్టుపైన వాహనాలు నిలిపి చేసి, గోతులన్నీ పూర్తిస్థాయిలో పూడ్చాలని కోరారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకర్రెడ్డి

175 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం

స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్, ఐటిడిఎ ఉద్యోగులకు జిల్లా కేంద్ర ఆసుపత్రి, మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 175 మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తొలుత కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత ప్రారంభించారు. డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం కింద 175 మంది రిజిస్ట్రేషన్ అయ్యారు.

105 మందికి ల్యాబ్ పరీక్షలు, 64 మందికి ఇసిజి, 19 మంది హైపర్ టెన్షన్, 17 మందికి డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 41 మందికి ఓరల్ కేన్సర్, 43 మందికి బ్రెస్ట్ కేన్సర్, 20 మందికి సర్వైకల్ కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. గుండె విభాగంలో 11 మంది, న్యూరాలజీలో నలుగురు, గ్యాస్ట్రో ఎంటరాలజీలో 8 మందికి రిఫర్ చేశారు.

కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న డిఐఇఒ నాగేశ్వరరావు

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

డిఐఇఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఇంటర్మీడియట్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డిఐఇఒ వై.నాగేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులు గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యలో మెరుగుపడే విధంగా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు.

అనంతరం కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రిన్సిపల్ డిజిఎస్వి త్రినాథను ఆదేశించారు. కళాశాల ఆవరణలో ప్రేయర్ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మద్యం పారబోత

ప్రజాశక్తి-పాలకొండ

గత నాలుగు నెలల్లో 25 కేసుల్లో పట్టుకున్న 636 లీటర్ల నాటుసారాను, 30 కేసుల్లో సీజ్ చేసిన 232 మద్యం సీసాలను ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో శనివారం పారబోశారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ మాట్లాడుతూ సారా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ కె.సూర్యకుమారి, ఎస్ఐలు తిరుపతిరావు, ఫణీంద్రబాబు పాల్గొన్నారు.

మద్యం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-పాచిపెంట

అల్లూరి జిల్లాకు చెందిన రైతుల బృందం పాచిపెంట మండలంలో అమ్మవలస, కేసలి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలను శనివారం సందర్శించింది. జిల్లా ఇన్ఛార్జి ఉమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను, కూరగాయల నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి సేద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రానున్న రోజులలో రసాయన వ్యవసాయాన్ని తగ్గించి ప్రకృతి సేద్య విస్తీర్ణాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్పిలు శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి పంచాయతీ పుట్టజమ్ము గ్రామ కూడలిలో నాటు సారా రవాణా చేస్తున్న సవరకోటపాడు గ్రామానికి చెందిన కద్రక రామన్నను అదుపులోకి తీసుకొన్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.